క్లుప్తంగా

భక్తి శ్రద్ధలతో ఉరుసు

తుగ్గలి : మండలంలోని మారెల్లలో కొలువైన బాబా మస్తాన్‌వలిస్వామి ఉరుసును బుధవారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. కుల మతాలకతీతంగా గ్రామస్తులు దర్గాను దర్శించి చక్కెర చదివింపులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఉరుసు సందర్భంగా సర్పంచ్ సుగునాథమ్మ కుటుంబ సభ్యులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. బంధుమిత్రుల రాకతో గ్రామంలో సందడి నెలకొంది.

ఉల్లాసంగా ఫేర్‌వెల్ డే



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ మల్లికార్జున

వెల్దుర్తి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో బుధవారం సీనియర్ ఇంటర్‌మీడియెట్ విద్యార్థులకు జూనియర్ విద్యార్థులు ఏర్పాటు చేసిన ఫేర్‌వెల్ ఉల్లాసంగా సాగింది. కాలేజీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మల్లికార్జున ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థుల సాంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఫైనల్ పరీక్షలు బాగా రాయాలని సూచించారు.సెల్‌ఫోన్ అతిగా వాడకుండా, పట్టుదలతో చదివాలని చెప్పారు. అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కంప్యూటర్, ప్రింటర్ అందజేత



యాటకల్లు పాఠశాలకు కంప్యూటర్, ప్రింటర్ అందజేసిన ఐడీబీఐ బ్యాంకు అధికారులు

ఆస్పరి: మండలంలోని యాటకల్లు ప్రాథమిక పాఠశాలకు బుధవారం ఆదోని ఐడీబీఐ బ్యాంకు అధికారులు కంప్యూటర్, ప్రింటర్, బీరువా, టేబుల్‌ను అందజేశారు. హెచ్‌ఎం ఉరుకుంద, పీఎంసీ చైర్మన్ సుదర్శన్, ఆదోని, గుంతకల్లు ఐడీబీఐ బ్యాంకు మేనేజర్లు, సిబ్బంది సోమన్న, హరీష్ కుమార్, సుభాష్, రాకేష్‌ను సన్మానించారు. ఉపాధ్యాయులు నాగరాజు, వీరారెడ్డి పాల్గొన్నారు.

గాజులదిన్నె ప్రాజెక్టు పైపు లీకేజీ



ఎరుకలచెర్వు వద్ద పైపునకు రంధ్రం పడిన దృశ్యం

కృష్ణగిరి: గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి వచ్చే తాగునీటి పైపు లైన్‌కు భారీ రంధ్రం ఏర్పడి నీరు వృథాగా పారిపోతున్నాయి. ప్రాజెక్టు నుంచి పీ.కోట కొండ వద్ద నీటిని శుద్ధి చేసి అక్కడి నుంచి మండలంలోని గ్రామాలకు తాగునీరు సరఫరా చేసే ప్రధాన పైప్‌లైన్‌కు ఆగవేళి- ఎరుకలచెరువు గ్రామాల ఇలా రంధ్రం పడింది. నీరంతా వృథాగా పోవడంతో నీరు సక్రమంగా సరఫరా కావడం లేదని సమీప గ్రామాల ప్రజలు వాపోతున్నారు. అయినప్పటికీ అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో ప్రజల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

బైక్‌లు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు

దేవనకొండ: మండలంలోని తెర్నేకల్ గ్రామ సమీపంలో బుధవారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ముగ్గురికి గాయలాయ్యాయి. వివరాలు..ఆదోని మండలం తొగల్‌గల్ గ్రామానికి చెందిన మల్లికార్జున, గంగన్న ద్విచక్ర వాహనంపై బుధవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో తెర్నేకల్ సమీపంలో బంధువుల ఇంటికి వస్తుండగా, ఎదురుగా మరో ద్విచక్ర వాహనం గంజహళ్లి గ్రామం వైపు వెళ్తోంది. ప్రమాదవశాత్తు రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో గంగన్న, మల్లికార్జునకు తీవ్ర గాయాలు కాగా, మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నకిలీ మస్టర్లు నిర్వహిస్తే చర్యలు

హాలహర్వి: ఉపాధి కూలీలు పనులకు వెళ్లకుండా వెళ్లినట్లు మస్టర్‌లో నమోదు చేస్తే అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ వరలక్ష్మి హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలో ఉపాధి హామీ కూలీలతో సమావేశమై మాట్లాడారు. ఇటీవల ప్రజా ఫిర్యాదుల వేదికలో కొందరు ఫిర్యాదు చేశారని చెప్పారు. ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కొందరు పనికి వెళ్లకున్నప్పటికీ వారికి కూలి మొత్తం అందుతోందని ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. అలాంటి వారి ఖాతాల్లో డబ్బులు పడ్డాయా, లేదా అని విచారించారు. ఏపీఓ చక్రవర్తి, టెక్నికల్ అసిస్టెంట్ రాము, పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం

పత్తికొండ రూరల్ : కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేశారని వామపక్ష, రైతు సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ఆందోళన చేపట్టారు. స్థానిక అంబేడ్కర్ కూడలి నుంచి నాలుగు స్తంభాల కూడలి వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేశారు. రైతు సంఘం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి సురేంద్ర, ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ కార్యదర్శి కృష్ణయ్య, సీఐటీయూ తాలుకా సెక్రెటరీ దస్తగిరి, సీపీఎం మండల కార్యదర్శి చక్రాళ్ల వెంకటేశ్వరరెడ్డి మాట్లాడారు.

ఆలూరు: కేంద్ర బడ్జెట్‌లో కార్మికుల సంక్షేమానికి నిధులను కేటాయించకపోవడాన్ని నిరసిస్తూ ప్రజాసంఘాల నాయకులు బుధవారం ధర్నా చేసి బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. అంబేడ్కర్ సర్కిల్ వద్ద సీపీఐ మండల కార్యదర్శి రామాంజనేయులు ఆధ్వర్యంలో సీపీఎం, సీపీఐ, సీఐటీ యూ, ఏఐటీయూసీ సంఘాల నాయకులు ఎన్డీఏ ప్రభుత్వ తీరును ఎండగట్టారు. నారాయణస్వామి, భూపేష్ పాల్గొన్నారు.

నో టెన్షన్!

విద్యా విధానంలో జగనన్న ప్రభుత్వం ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చింది. అందులో ప్రముఖమైనది. పదో తరగతి పరీక్షల పద్ధతి మార్పు. రెండేళ్ల క్రితం వరకు పది పరీక్షలను 11 రోజుల పాటు 11 పేపర్లు నిర్వహించేవారు. దీంతో విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఒత్తిడికి గురయ్యేవారు. ముఖ్యంగా పరీక్షలంటే అభ్యాసకుల్లో ఆందోళన అధికంగా ఉండేది. దీన్ని నివారించేందుకు నాటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆరు సబ్జెక్టులు ఏడు పేపర్లుగా మార్చింది. దీంతో విద్యార్థులపై కొంతమేర ఒత్తిడి తగ్గింది. ఈ ఏడాది అదే విధానాన్ని అనుసరిస్తూ ప్రతి పరీక్షకు ఒక రోజు విరామం ఇచ్చారు.

- పదో తరగతి పరీక్షల్లో సమూల మార్పులు
- ఆరు సబ్జెక్టులు..ఏడు పేపర్లు
- ఒక్కో పేపర్‌కు వంద మార్కులు
- విద్యార్థులపై భారం తగ్గించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంస్కరణలు
- విద్యార్థులకు ఊరట
- మండలంలో పరీక్షలు రాయనున్న 872 మంది విద్యార్థులు
- మార్చి 17 నుంచి పది పరీక్షలు



ఆలూరులోని ప్రభుత్వ బాలుర-1 పాఠశాలలో ప్రత్యేక తరగతిలో చదువుకుంటున్న పదో తరగతి విద్యార్థులు

ఆలూరు రూరల్: పదో తరగతి పరీక్షలు అనగానే విద్యార్థుల్లో హడావుడి, మానసిక ఒత్తిడి సాధారణం . విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపుతారు. గతంలో 11 రోజులు పరీక్షలు రాయాల్సి ఉండటంతో విద్యార్థులు ఒత్తిడికి గురయ్యేవారు. అయితే ప్రస్తుతం పదో తరగతి పరీక్షల్లో ఆరు సబ్జెక్టులు ఏడు పేపర్ల విధానంతో విద్యార్థులపై ఒత్తిడి బాగా తగ్గింది. అలాగే.. పరీక్షకు పరీక్షకు మధ్య విరామం ప్రకటించింది. గత విద్యా సంవత్సరం మాదిరిగానే పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ఏడు పేపర్లుగా నిర్వహించనున్నారు. మండలంలోని 15 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో మొత్తం 872 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పది పరీక్షలు రాయనున్నట్లు విద్యాశాఖ అధికారులు వెల్లడించారు.


గతంలో ఇలా..

పదో తరగతి పరీక్షలు చాలా సంవత్సరాల పాటు 11 పేపర్లు నిర్వహించారు. హిందీ మినహా తెలుగు, ఇంగ్లిష్, గణితం, సోషల్,సైన్స్ సబ్జెక్టుల్లో ప్రతి సబ్జెక్టుకు 50 మార్కులు చొప్పున రెండు పేపర్ల ప్రకారం నిర్వహించారు. కరోనా ప్రభావంతో 2019-20, 2020-21 విద్యా సంవత్సరంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలను రద్దు చేశారు. కరోనా తీవ్రత తగ్గడంతో 2021-22 విద్యా సంవత్సరంలో 11 పేపర్లను 7 పేపర్లుకు కుదించారు. తెలుగు,హిందీ, ఇంగ్లిష్, గణితం, సోషల్ సబ్జెక్టులలో ఒక్కో పేపర్‌కు 100 మార్కులు చొప్పున, ఫిజిక్స్, బయాలజీ పేపర్లకు ఒక్కో పేపర్‌కు 50 మార్కుల చొప్పున నిర్దేశించారు. ఎన్నో సంవత్సరాలుగా ఉన్న విధానానికి స్వస్తి పలకడంతో విద్యార్థులకు భారం తప్పింది.

ఈ ఏడాది పరీక్షలు ఇలా..

2022-23 విద్యా సంవత్సరంలో పది పరీక్షలను ఏడు పేపర్లుగా కుదించారు. ప్రతి సబ్జెక్టుకు 100 మార్కులు కేటాయించారు. సైన్స్ సబ్జెక్టులో మాత్రం ఫిజిక్స్, బయాలజీ సబ్జెక్టులలో ఒకే ప్రశ్నపత్రాన్ని ఇచ్చారు. జవాబు మాత్రం వేర్వేరు సమాధాన బుక్‌లెట్లలో రాయాలి. గత విద్యా సంవత్సరంలో మూల్యాంకనం చేసేందుకు వీలుగా రెండు పేపర్లు ఇచ్చేవారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో విద్యార్థుల్లో ఒత్తడిని తగ్గించి పరీక్షలపై ఉండే భయాన్ని పోగొడుతుందని ఉపాధ్యాయులు భావిస్తున్నారు. ఈ విద్యా సంవత్సరంలో నిర్వహించే పది పబ్లిక్ పరీక్షల్లో కూడా ఆరు సబ్జెక్టులకు ఏడు పరీక్షలు నిర్వహించనున్నారు.

మార్చి 17 నుంచి పరీక్షలు



పదో తరగతి పరీక్షలు మార్చి 17 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్నారు. సోషల్ పరీక్ష మార్చి 31వ తేదీ పూర్త వుతుంది.ఇప్పటికే ప్రభుత్వం పరీక్షల షెడ్యూల్‌ను విడుదల చేసింది. ప్రతి పరీక్షకు మధ్య ఒక రోజు విరామం ఇచ్చారు.

ఒత్తిడి తగ్గి బాగా చదువుకోవచ్చు



ప్రస్తుతం పదో తరగతి విద్యార్థుల్లో ఒత్తడి తగ్గి పరీక్షలు బాగా రాసే అవకాశాలు ఉన్నాయి. సబ్జెక్టు పరీక్షకు మధ్య సెలవు రావడం విద్యార్థులకు ఎంతో ఉపయోగం. ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి. ప్రతి పాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా చర్యలు తీసుకోవాలి. ఇప్పటికే విద్యార్థులకు ప్రత్యేక తరగతులు, స్టడీ మెటీరియల్ అందజేయడం, అంశాల వారీగా తర్ఫీదునిస్తున్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాం. నూతన విధానం ద్వారా పరీక్షల సంఖ్య, విద్యార్థులపై భారం తగ్గుతుంది.

– కోమలాదేవి, ఎంఈఓ,ఆలూరు

విద్యుత్ సరఫరా వేళల్లో మార్పు

మద్దికెర : మండలంలో వ్యవసాయ విద్యుత్ సరఫరా నేటి నుంచి నిరంతరాయంగా 9 గంటల పాటు ఇవ్వనున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ మహమ్మద్‌రఫీక్ బుధవారం తెలిపారు. నంచర్ల, పెరవలి, కొత్తపల్లి ఫీడర్ల ద్వారా వ్యవసాయానికి ఉదయం 7:30 నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు అందజేస్తామని చెప్పారు. అన్నదాతలు మార్పు గమనించాలని సూచించారు.

- ఆలూరు: వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని వ్యవసాయ విద్యుత్ వేళల్లో మార్పులు చోటు చేసుకున్నాయని, వాటిని నేటి నుంచి అమలు చేస్తామని ఆలూరు విద్యుత్ శాఖ ఏడీఈ సంతోష్ కుమార్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ..గురువారం నుంచి ఉదయం 7:30 నుంచి సాయింత్రం 4:30 గంటల వరకు సరఫరా చేస్తామని చెప్పారు.
- కృష్ణగిరి: మండలంలోని అన్ని గ్రామాల్లోని రైతులకు త్రీఫేస్ విద్యుత్ సరఫరాలో గురువారం నుంచి స్వల్ప మార్పులు చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ మద్దిలేటి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం నుంచి ఉదయం 7:30 నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు సరఫరా చేస్తామని వెల్లడించారు.

ఈఓఆర్‌డీపై విచారణ



సిబ్బందిని విచారిస్తున్న డీఎల్‌పీఓ లక్ష్మి

దేవనకొండ: మండలంలో పనిచేసే ఓ మహిళపై ఈఓఆర్‌డీ అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని సదరు మహిళ భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం కర్నూలు డీఎల్‌పీవో లక్ష్మి విచారణ చేపట్టారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బందిని విచారించారు. ఆమె మాట్లాడుతూ పూర్తి స్థాయిలో విచారించి నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు పంపుతామని చెప్పారు.

రీ సర్వేపై రైతులకు సమాచారమివ్వాలి



ఎరుకలచెర్వు సమీపంలో రీ సర్వే అధికారులకు సూచినలిస్తున్న ఆర్డీఓ భరత్‌నాయక్

కృష్ణగిరి: రీ సర్వే ఏ రైతుల పొలాల్లో చేస్తున్నారో ఆ రైతులకు సమాచారం ఇచ్చి చేయాలని పత్తికొండ ఆర్డీఓ భరత్‌నాయక్ రెవెన్యూ సిబ్బందికి సూచించారు. మండలంలోని ఎరుకలచెర్వు గ్రామ పొలాల్లో జరుగుతున్న రీ సర్వేను బుధవారం ఆయన పరిశీలించారు. రీ సర్వే చేస్తున్న సమయంలో రైతులు తప్పక వారి పొలాల వద్ద ఉండాలన్నారు. అలా కాకుండా సర్వే చేయవద్దని చెప్పారు. ముందస్తుగా రైతులకు సమాచారం ఇచ్చి వారి సమక్షంలోనే సర్వే చేయాలని, అలాగే పొలాలకు వెళ్లే రహదారులు పక్కాగా చూపాలన్నారు. అనంతరం కృష్ణగిరి తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించి వీఆర్వోలతో మాట్లాడారు. తహసీల్దార్ చంద్రశేఖర్, వీఆర్వోలు వెంకటేశ్వర్లు, నాగరత్నమ్మ, అనిల్‌కుమార్, సచివాలయ సర్వేయర్లు ఉన్నారు.

రైతులు ఈ-కేవైసీ చేయించుకోవాలి



కామినహాల్‌లో రైతులకు సూచనలిస్తున్న ఏఓ శివశంకర్

హాలహర్వి: రబీ సీజన్‌లో పంటలు సాగు చేసి ఈ-పంటలో నమోదు చేసుకున్న రైతులు ఈ-కేవైసీ తప్పనిసరిగా రైతు సేవా కేంద్రాల్లో చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి శివశంకర్ సూచించారు. బుధవారం మండలంలోని కామినహాల్, మెదేహాల్ గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు సలహాలు, సూచనలు తెలియజేశారు.వ్యవసాయాధికారి మాట్లాడుతూ ఆఖరి దుక్కిలోనే కాంప్లెక్స్ వేసుకోవాలన్నారు. అలాగే పొటాష్, యూరియా మాత్రమే వేసుకోవాలని సూచించారు. ఖరీఫ్ సీజన్‌లో వేసిన కంది పంటను ప్రభుత్వం మార్క్‌ఫెడ్, నాఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తుందని, మద్దతు ధర క్వింటానికి రూ.7550గా ప్రకటించారని చెప్పారు. కంది పంట వేసిన రైతులందరూ రిజిస్ట్రేషన్ చేయించుకుని విక్రయించుకోవాలని తెలిపారు. ఎంపీఈఓలు సూరన్న, ఏఈఓ శ్రీకాంత్, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా కుంభోత్సవం



కుంభాలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

హాలహర్వి: మండలంలోని బల్లూరు గ్రామంలో దేవమ్మ, సుంకులమ్మ దేవి కుంభోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు, మహిళలు నైవేద్యాన్ని కుంభాల్లో ఉంచి ఊరేగింపుగా ఆలయాలకు వెళ్లి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. భక్తుల రాకతో ఆలయ ప్రాంగణాలు కిటకిటలాడాయి. ఎస్‌ఐ చంద్ర ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. వేడుకల్లో ఎమ్మెల్యే బి.విరూపాక్షి సోదరుడు శ్రీరాములు పాల్గొన్నారు. నాయకులు శేషప్ప, మారెన్న, పంపాపతి, కృష్ణ, నాగ, దిబ్బలంక, లింగప్ప, శేఖన్న, బసవరాజు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో మేటి కుంభోత్సవం



గజ్జహళ్లిలో మారెమ్మ దేవి రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



మేటి కుంభాన్ని తీసుకొస్తున్న భక్తురాలు

హొళగుంద: మండలంలోని గజ్జహళ్లి గ్రామంలో మారెమ్మ దేవి మేటి కుంభోత్సంవం వైభవంగా జరిగింది. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ప్రారంభమైన దేవర వేడుకల్లో భాగంగా రథాన్ని ఆలయం వరకు తీసుకొచ్చి మారెమ్మ ఉత్సవమూర్తిని అధిష్టింపజేసి ఊరేగించారు. బుధవారం ఉదయం గ్రామ శివారులో గంగపూజ చేశారు. గ్రామపెద్దలు నారాయణరెడ్డి, గోపాల్ రెడ్డి ఇంటి నుంచి మేటి కుంభాలను ఆలయానికి ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి అభిషేకాలు, మహామంగళారతి, నైవేద్య సమర్పణ, భజన తదితర కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం గ్రామస్తులు అమ్మవారికి పిండి వంటలను నైవేద్యంగా కుంభాల్లో ఉంచి ఆలయానికి ఊరేగింపుగా వచ్చి సమర్పించారు. సంమృద్ధిగా పాడిపంటలతో ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలనికార్యక్రమం నిర్వహించినట్లు గ్రామపెద్దలు తెలిపారు.

ఘనంగా నంది ఉత్సవం



తేరు బజారులో ఉచ్ఛాయాన్ని లాగుతున్న భక్తులు

హొళగుంద: మండల కేంద్రంలో వెలసిన సిద్ధేశ్వర స్వామి ఉత్సవాలను పురస్కరించుకుని బుధవారం రాత్రి నంది ఉత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఉచ్ఛాయంలో అధిష్ఠింపజేసిన నంది విగ్రహానికి పూజారులు మహామంగళారతి, ఇతర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు స్థానిక తేరుబజారులో ఉచ్ఛాయాన్ని ఎదురు బసవన్న గుడి వరకు లాగారు. జాతరలో భాగంగా రథోత్సవానికి ముందు రెండు రోజులు చెడు ఉచ్ఛాయం (నంది ఉత్సవం), మంచి ఉచ్ఛాయం (గజోత్సవం) పేరిట ఉచ్ఛాయలు లాగటం ఆనవాయితీ. అందులో భాగంగా బుధవారం చెడు ఉచ్ఛాయంగా భావిస్తున్న నంది ఉచ్ఛాయాన్ని లాగారు. గురువారం గజోత్సవం, శుక్రవారం స్వామివారి రథోత్సవం, శనివారం లంకాదహన కార్యక్రమాలు ఉంటాయని ఆలయ వంశ పారంపర్య ధర్మకర్తలు రాజపంపన్నగౌడ. శివ శంకర్‌గౌడ్, సిద్ధార్థగౌడ్ తెలిపారు.

సంక్షిప్తం

సర్వేలు త్వరగా పూర్తి చేయాలి

ఆలూరు రూరల్: ప్రభుత్వ ఆదేశాల మేరకు సచివాలయ సిబ్బంది ఇంటింటి సర్వేలు త్వరగా పూర్తి చేయాలని మండల ఈఓపీఆర్డీ ప్రభాకర్ తెలిపారు. బుధవారం మండలంలోని హత్తిబెళగల్ గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసి మాట్లాడారు. హౌస్ హోల్డ్ సర్వే, ఎంఎస్‌ఎంఈ, ఎన్‌పీసీఎల్ వంటి తదితర సర్వేలు పూర్తి చేయాలన్నారు. ప్రతి రోజు తప్పని సరిగా బయోమెట్రిక్ హాజరు వేయాలన్నారు. అనంతరం గ్రామంలో చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు.

పన్నులు సకాలంలో చెల్లించండి

ఆలూరు : ఇంటి, కుళాయి, వాణిజ్య సముదాయాల పన్నులు సకాలంలో చెల్లించి గ్రామాల అభివృద్ధికి సహకరించాలని చిప్పగిరి ఈఓపీఆర్డి బాలన్న మండల ప్రజలకు సూచించారు. చిప్పగిరి మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

తుగ్గలి : మారెల్ల సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మారెల్లకు చెందిన అజయ్, ములకలపెంటకు చెందిన హరి బైక్‌పై పెండేకల్లు రైల్వే జంక్షన్ వైపు వెళ్తుండగా మార్గమధ్యలో ఎదురుగా వచ్చిన ట్రాలీ ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో అజయ్, హరి కాళ్లకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం 108 వాహనంలో పత్తికొండకు తరలించారు. ప్రాథమిన చికిత్స అనంతరం కర్నూలుకు తీసుకెళ్లారు.

రైతు సేవా కేంద్రం తనిఖీ

దేవనకొండ: మండలంలోని పల్లెదొడ్డి రైతు సేవా కేంద్రాన్ని మండల వ్యవసాయాధికారి సురేష్‌బాబు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఏఓ మాట్లాడుతూ మండలంలో దాదాపు 23 వేల మంది రైతులు ఫార్మర్ యూనిక్ ఐడీ కోసం ఫార్మర్ రిజిస్ట్రీలో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉందన్నారు. రైతులు ఆధార్‌కార్డు, పట్టాదారు పాసు పుస్తకం, బ్యాంకు ఖాతా పుస్తకం, మొబైల్ నంబర్ జిరాక్స్‌లను తీసుకుని వెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.

జాబ్‌కార్డు ఉన్న వారందరికీ 'ఉపాధి'

ఆలూరు రూరల్: ఉపాధి హామీ పథకం కింద జాబ్ కార్డు ఉన్న కూలీలందరికీ పనులు కల్పించాలని బుధవారం ఎంపీడీఓ మహబూబ్ బాషా ఎస్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బందికి సూచించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో కూలీలకు వంద రోజుల పనిదినాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మండలంలో 8 వేల జాబ్ కార్డులు ఉండగా.. 1300 మంది పనికి వస్తున్నారని ఇప్పటి వరకు 477 మంది వంద రోజుల పని పూర్తి చేశారని ఏపీఓ శ్రీనివాసులు ఎంపీడీఓకు వివరించారు.

పాఠశాల భవన నిర్మాణానికి భూమి పూజ

వెల్దుర్తి: స్థానిక 4వ వార్డులో అంగన్‌వాడీ కేంద్రం పక్కన ఏబీఎం సంఘం ఆధ్వర్యంలో ఎయిడెడ్ పాఠశాల నూతన భవనం నిర్మాణానికి బుధవారం భూమి పూజ నిర్వహించారు. ఇప్పటికే ఏబీఎం ఎయిడెడ్ ప్రైమరీ స్కూల్ పాత భవనంలో కొనసాగుతోంది. అయితే మాజీ ఎంపీపీ బొమ్మన దశరథ రామిరెడ్డి 4వ వార్డులో తనకు చెందిన దాదాపు రూ.30లక్షల విలువ జేసే 30 సెంట్ల స్థలంతో పాటు భవన నిర్మాణానికి రూ.3లక్షలు అందజేయడంతో నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పాస్టర్ ఏసేపు,గోరంట్ల పాస్టర్ రవికుమార్, జెడ్పీటీసీ సభ్యుడు దాదిపోగు సుంకన్న పాల్గొన్నారు.

ఈఓఆర్‌డీపై అభాండాలు తగదు

దేవనకొండ: ఈఓఆర్‌డీ సూర్యనారాయణపై అభాండాలు మోపడం తగదని జెడ్పీటీసీ రామకృష్ణ, సీపీఐ మండల కార్యదర్శి నరసారావు, జిల్లా వ్యవసాయ సంఘం కార్యదర్శి వీరశేఖర్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఈఓఆర్‌డీపై విచారణకు వచ్చిన డీఎల్‌పీవో లక్ష్మికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ విధుల పట్ల అలసత్వం వహించిన వారికి మాత్రమే ఈఓఆర్‌డీ మెమోలు అందజేశారని చెప్పారు.

13న వలసల నివారణపై సదస్సు

పత్తికొండ రూరల్ : ఈనెల 13వ తేదీన వలసల నివారణపై పట్టణంలోని సాయిబాబా ఆలయ ప్రాంగణంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వీరశేఖర్, నారాయణ తెలిపారు. బుధవారం స్థానిక ఈశ్వరరెడ్డి భవన్‌లో వారు మాట్లాడుతూ సదస్సుకు వ్య.కా.స. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, ఉపాధి హామీ పీడీ హాజరవుతారని చెప్పారు.

సర్వసభ్య సమావేశం మరోసారి వాయిదా

తుగ్గలి : మండల సర్వసభ్య సమావేశం మరోసారి వాయిదా పడింది. ఇన్‌చార్జ్ ఎంపీపీ ఎర్ర నాగప్ప అధ్యక్షతన సమావేశం నిర్వహించేందుకు అధికారులు రెండో రోజు ఏర్పాట్లు చేశారు. ఇన్‌చార్జ్ ఎంపీపీతో పాటు మరో ఇద్దరు సభ్యులు మాత్రమే హాజరు కావడంతో కోరం లేక మంగళవారం వాయిదా పడిన విషయం తెలిసిందే. అయితే బుధవారం కూడా ఎంపీపీ మినహా మిగిలిన ఎంపీటీసీ సభ్యులంతా గైర్హాజరు కావడం గమనార్హం. దీంతో ఎంపీడీఓ విశ్వమోహన్ సమావేశాన్ని మరోమారు వాయిదా వేస్తున్నట్లు చెప్పారు. తదుపరి సమావేశం ఎప్పుడు నిర్వహించేది త్వరలో ప్రకటిస్తామన్నారు.

ఎంపీటీసీల్లో అసంతృప్తి..

మండలంలో ఉన్న17 మంది ఎంపీటీసీ సభ్యులంతా వైఎస్సార్‌సీపీ వారే. బీసీ రిజర్వు అయిన ఎంపీపీ స్థానంలో మొదట పగిడిరాయి ఎంపీటీసీ సభ్యురాలు ఆదెమ్మ ఎంపీపీగా ఎన్నికయ్యారు. ఒప్పందంలో భాగంగా రెండున్నరేళ్ల తర్వాత గత ఏడాది మార్చి 29న ఆమె రాజీనామా చేశారు. తర్వాతి రెండున్నరేళ్లు శభాష్‌పురం ఎంపీటీసీ సభ్యురాలు రామాంజినమ్మను ఎంపీపీగా చేసేందుకు పార్టీ అధిష్టానం నిర్ణయించింది. అయితే సార్వత్రిక ఎన్నికల ఎన్నికల దృష్ట్యా కోడ్ అమల్లో ఉండటంతో అప్పట్లో వీలు కాలేదు. ఎంపీపీ ఎన్నికకు నోటిఫికేషన్ వెలువడేంత వరకు వైస్ ఎంపీపీ-2గా ఉన్న జొన్నగిరి ఎంపీటీసీ సభ్యుడు నాగప్పను ఇన్‌చార్జ్ ఎంపీపీగా నియమిస్తూ గతేడాది జూలై 26న జెడ్పీ సీఈవో కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇన్‌చార్జ్ ఎంపీపీగా బాధ్యతలు తీసుకున్న నాగప్ప సొంత పార్టీ ఎంపీటీసీ సభ్యులను కాదని టీడీపీ నాయకులకు మండల నిధులు ఇవ్వడం, తమకు తెలియకుండా తీర్మాణాలు చేస్తున్నారని ఎంపీటీసీలు అసంతృప్తితో ఉన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన నాటినుంచి ఆయన వ్యవహార శైలిలో మార్పు వచ్చిందని, అధికార పార్టీ నాయకులకే ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపిస్తున్నారు. దీంతో మహిళకు రిజర్వు అయిన ఎంపీపీ స్థానంలో వారినే ఎన్నుకునేలా గైర్హాజరవ్వాలని నిర్ణయించు కున్నట్లు తెలుస్తోంది. సభ్యుల గైర్హాజరుపై ఇన్‌చార్జ్ ఎంపీపీ నాగప్ప స్పందిస్తూ గౌరవ వేతనం అందకపోవడం, అభివృద్ధి పనుల విషయంలో అధికారులు తమను పరిగణలోకి తీసుకోవడం లేదనే కారణంతో గైర్హాజరయ్యాని తెలుస్తోందన్నారు. అందరి సహకారంతో అభివృద్ధి చేయాలనుకున్నానే తప్ప తాను అధికార పార్టీకి ప్రాధాన్యత ఇవ్వడంలేదని తెలిపారు.

సంప్రదాయానికి ప్రతీక బండలాగుడు పోటీలు



మారెల్లలో బండలాగుడు పోటీలు ప్రారంభిస్తున్న పత్తికొండ రూరల్ సీఐ పులిశేఖర్

తుగ్గలి : ఉత్సవాల సందర్భంగా పల్లెలో నిర్వహించే వృషభాల బండలాగుడు పోటీలు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని పత్తికొండ రూరల్ సీఐ పులిశేఖర్ అన్నారు. బాబా మస్తాన్‌వలి స్వామి ఉరుసు సందర్భంగా మారెల్లలో బుధవారం నిర్వహించిన బండలాగుడు పోటీలను ప్రారంభించారు. సీఐ మాట్లాడుతూ.. వ్యవసాయంలో చేదోడుగా ఉంటున్న పశువులను రైతులు సంరక్షించుకోవాలన్నారు.

పోటీలో విజేత బేతంచెర్ల వృషభాలు..

హోరాహోరీగా జరిగిన బండలాగుడు పోటీల్లో బేతంచెర్ల భానుజ వృషభాలు విజేతగా నిలిచాయి. తర్వాతి స్థానాల్లో దొర్నిపాడు, దాసరిపల్లి బత్తుల మనోహర్, దేవరాజునాయుడు వృషభాలు, మారెల్ల వడ్డే పరమేష్, జొన్నగిరి అద్దంకి మస్తాన్, బోయినపల్లి నరసింహారెడ్డి, పందిర్లపల్లి ఖలీల్‌బాషా వృషభాలు నిలిచాయి. ఎద్దుల యజమానులకు వరుసగా దాతల సహకారంతో రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేలు అందజేశారు.

నీటి సమస్యను పరిష్కరిస్తాం

మద్దికెర : స్థానిక గడ్డం వీధిలోని ఎల్లమ్మ దేవాలయం వద్ద నీటి సమస్య తమ దృష్టికి వచ్చిందని ప్రత్యేక పైపులైను వేసి నీటిని సరఫరా చేసేందుకు చర్యలు చేపడతామని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ డీఎం ఖాస్ తెలిపారు. బుధవారం ఎల్లమ్మ దేవాలయ ప్రాంతాన్ని పరిశీలించి త్వరలోనే పనులు ప్రారంభించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఏఈ మయాంక్, ఈఓ శివకుమార్, బండారి ఆంజనేయులు ఉన్నారు.

నిబంధనలే అడ్డంకి!

- కందుల విక్రయానికి ముందుకు రాని రైతులు

మద్దికెర : కష్టపడి పండించిన పంటలకు అమ్ముకుందామంటే సవాలక్ష నిబంధనలు, ధర గిటుబాటు గాక కందులు అమ్మేందుకు రైతులు ముందుకు రావడం లేదు. దీంతో మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రాలు బుధవారం రైతులు లేక వెలవెలబోయాయి. కందులకు ప్రభుత్వం రూ.7,550 మద్దతు ధర ప్రకటించింది. అయితే బయట మార్కెట్లో రూ.7,800 వరకు ధరలు ఉండటంతో పాటు ఎకరాకు 4 క్వింటాలు మాత్రమే కొనుగోలు చేస్తామనడం, ముందుగా నమోదు చేసుకోవాల్సి ఉండటం, ఈ- క్రాప్ చేయించి ఉండాలని, నాణ్యత పేరుతో పలు రకాల నిబంధనలు విధించడంతో రైతులు విక్రయించడానికి ఆసక్తి చూపడం లేదు.



రైతులు లేక వెలవెలబోతున్న కొనుగోలు కేంద్రం